

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## – వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

### రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే

### *చివరి విడత: మలి సందడి (58)*

*1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.*

*అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.*

*ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-2020లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.*

*అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.*

*రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.*

**కౌముదికి వందనాలు**

నన్ను డెప్యుటేషన్ మీద జర్మనీ పంపడానికి మా ఆఫీసు నిర్ణయించినప్పుడు- 1973-74ఎదురైన అనుభవాల్ని- 'ఫారిన్ వెళ్లాలండి' అనే నవలగా రూపొందిస్తే- 'ఉదయం' మాసపత్రిక ప్రచురించింది. 1974-76లో జర్మనీలో పొందిన అనుభవాల్ని అదే తరహాలో క్రోడీకరించి 'ఫారిన్ వెళ్లానండి' నవల వ్రాశాం. అప్పట్లో ప్రాచుర్యమున్న 'నవలానుబంధం' ప్రక్రియకు అనుగుణంగా పేజీలు నిర్ణయించడంవల్లనేమో- వ్రాసింది చదివితే నవలకు సినాప్సిస్‌లా అనిపించింది. పక్కన పెట్టేశాం.

కొత్త శతాబ్దంలో ఆవిర్భవించిన కౌముది వెబ్ పత్రిక కొత్త ఒరవడులను ప్రదర్శిస్తూ, మా అభిరుచులకు అనుగుణంగా ఉన్నట్లు తోచింది. ఐతే 'ఫారిన్ వెళ్లానండి' ప్రచురణకు రెండు ఇబ్బందులున్నాయి. ఇది ఎన్నో ఏళ్లక్రితం ప్రచురితమైన 'ఫారిన్ వెళ్లాలండి'కి కొనసాగింపు. పాఠకుల సౌలభ్యానికి- మొదటి భాగాన్ని మళ్లీ ప్రచురించాలి. అదలాగుంచితే, మాకు సాహితీపరంగా ఉన్న ఇతర కమిట్‌మెంట్ల వల్ల రెండో భాగాన్ని ఏకబిగిన వ్రాసివ్వలేము. ఆ విషయం శ్రీ కిరణ్‌ప్రభకు చెబితే- మొదటి నవలను పునర్ముద్రించడానికీ, తదుపరి రెండో భాగాన్ని అంచెలంచెలుగా అందుకునేందుకూ వారు సుముఖులయ్యారు. అందుకు సహృదయంతోపాటు- రచయితపై బాగా నమ్మకముండాలి. ఎందుకంటే మధ్యలో కౌముది నమ్మకానికి పరీక్ష కూడా వచ్చింది.

నవల రెండో భాగం నడుస్తుండగా- అనారోగ్యం ఇబ్బందివల్ల నవలను కొనసాగించలేమన్న అధైర్యం కలిగి, మధ్యలో ఆపేద్దామా అనుకున్నాం. కానీ 'మీ అనారోగ్యం తాత్కాలికం. నెలకి కనీసం ఒక్క పేజీ అయినా పంపుతూ నవలను సీరియల్‌గా కొనసాగించండి' అన్నారు కిరణ్‌ప్రభ. పత్రికా సంపాదకుడినుంచి అటువంటి స్పందన ఉంటే, రచయితలను అనారోగ్యం ఏంచెయ్యగలదు? మేము వారికి ఏ నెలా ఆరు పేజీలకు తక్కువ కాకుండా పంపుతూ- మా మర్యాదను కాపాడుకోగలిగాం.

మరొకందుకు కూడా కౌముదికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఈ నవల రెండో భాగం మొదలెట్టినప్పుడు, ఇంత పెద్దది ఔతుందనుకోలేదు. కానీ కౌముది ప్రోత్సాహం మమ్మల్ని కాలయంత్రంలో 1974లోకి తీసుకుపోయింది. అప్పటి జీవితం మొత్తాన్ని మళ్లీ ఆస్వాదించాం. తొలుత వ్రాసిన సినాప్సిస్‌లో లేని ఎన్నో అంశాలు గుర్తుకొచ్చాయి. వయసొచ్చేక బాల్యంలో చేష్టల్ని విడియోలో చూసినప్పుడు కలిగే లాంటి అపూర్వానుభూతిని పొందాం. నలభైఏడేళ్ల క్రితం అనుభవాలు, అనుభూతులు- నిన్న జరిగినట్లు అనిపించి అలరించాయి. మాలోని పాఠకులకోసమని రచనలు చేసే మాకు పూర్తి సంతృప్తినిచ్చిన మరో రచన ఇది. కౌముదికి కృతజ్ఞతలు చెప్పకుండా ఎలా?

ఈ నవలలోని పాత్రలు సజీవాలు. ఇందులోని ఓ విశిష్ట పాత్ర శ్రీమతి ఎస్ఎస్ రావు- కౌముదిలో నవల చదివి స్పందించి- 46 ఏళ్ల తర్వాత గతానుభూతుల్ని మాతో పంచుకొనడం ఒక అద్భుతానుభవం.

మళ్లీ మేము జర్మనీ వెళ్లలేదు. కానీ ప్రస్తుతం జర్మనీలో ఉన్న మా అమ్మాయి రాజకుమారి, అల్లుడు సాంబశివరావు- ఇటీవలే బెర్లిన్ వెళ్లి, మేమిచ్చిన వివరాల్ని బట్టి 1974-75లో మేమున్న ఆ ఇంటిని గుర్తించి, బయట్నించి చూసి రావడం మరో విశేషం!

ఈ నవల పాఠకులకు నచ్చితే- ఆ ఘనత పూర్తిగా కౌముదిది. నచ్చకపోతే అన్న ప్రసక్తి లేదు. ఎందుకంటే- పాఠకులకు నచ్చనివి కౌముది ప్రచురించదు.

కౌముదికి, పాఠకులకు 2023కి నూతన సంవత్సర శుభాకాంక్షలు.

## *జననీ జన్మభూమిశ్చ*

నాలో దేశభక్తి ఎంతుందో, అసలుందో లేదో నేనెప్పుడూ అంచనా వేసుకోలేదు. కానీ 'మరికొద్ది క్షణాల్లో విమానం బొంబాయి విమానాశ్రయంలో దిగబోతోంది' అన్న ప్రకటన, బయటి ఉష్ణోగ్రత వివరాలు వింటుంటే– ఆ క్షణంలో తనువు నిలువెల్లా పులకరించింది. ఆ ఉత్సాహంతోనేమో– నా స్పెషల్ 'క్యాబిన్ లగేజి'తో ఎయిర్ పోర్టులో దిగడం కష్టమనిపించలేదు, దిగడానికి ఎంతోసేపూ పట్టలేదు.

బొంబాయి ఎయిర్ పోర్ట్. అంటే ఇండియా. నేను ఇండియాలో ఉన్నాను.

దిగుతూనే ఓవర్ కోట్ తీసేశాను. స్వెటర్ తీసేశాను. వీడ్కోలు జర్మనీకే కాదు– ఆ దుస్తులకి కూడా! ఎందుకంటే– భువనేశ్వర్లో ఉష్ణోగ్రత చలికాలంలో అప్పుడప్పుడు పది డిగ్రీల సెంటిగ్రేడుకి దిగువకి వెడుతూంటుంది. రాజమండ్రి నివాసికి ఆ చలి బాగా ఎక్కువే. ఐనా  నాక్కక్కడ స్వెటర్ అవసరపడలేదు. అసలు నేను కొన్న మొదటి స్వెటర్ ఢిల్లీలో– జర్మనీ ప్రయాణానికి విమానం ఎక్కబోయేముందు!

చలి దుస్తులనుంచి లభించిన స్వేచ్ఛని ఆస్వాదిస్తూ ఓసారి చుట్టూ చూశాను.

అది 1976 జనవరి. అప్పటికింకా మన విమానాశ్రయాలు అంతర్జాతీయ స్థాయి చేరుకోలేదు. విదేశాలతో పోలిస్తే తేడా చాలా స్పష్టంగా తెలుస్తోంది.

1966లో వచ్చిన సంగీతలక్ష్మి సినిమాలో కాబోలు– ఎన్టీ రామారావు ఎవరి సాయంతోనో ఓడ ప్రయాణం చేసి, వేరే దేశంనుంచి స్వదేశం చేరగానే కుంటుకుంటూ దిగి, ఒడ్డున మట్టిని చేత్తో తీసి, 'నేను పుట్టిన మట్టి ఇదీ, నేలమీది స్వర్గమిదీ' అని పాడతాడు.

ఈ విమానాశ్రయంలో కూడా ఆ పాటకు అనువైనంత మట్టి ఉంది. తనువునింకా జర్మనీ వాసనలు అంటిపెట్టుకుని ఉన్నాయేమో, నాకా మట్టి– నేలమీద స్వర్గాన్ని గుర్తు చెయ్యలేదు. సెంటిమెంట్లకు అతీతంగా– మిగతా ఫార్మాలిటీస్ పూర్తి చేసే హడావుడిలో ఉన్నాను మరి!

సామాను కలెక్ట్ చేసుకుందుకు కాసేపట్టింది. ట్రాలీ దొరకడంతో, నా 'క్యాబిన్ లగేజి'ని తరలించడం సులభమైంది.

ఇక కస్టమ్స్ చెక్. ఫ్రాంక్‌ఫుర్ట్‌లో లగేజి చెకిన్– సాటి ఇండియన్సుని కూడా అసూయకి గురి చేసేంత లాభంగా అయింది. ఇండియాలో కస్టమ్స్ చెక్ గురించి, ఇంతవరకూ స్వంతూరు దాటివెళ్లనివారు కూడా కథలుకథలుగా చెప్పుకుంటారు. అందుకని మనసులో కాస్త భయంగానే ఉంది– కూడా తెచ్చుకున్న వస్తువులకి ఎంతెంత డ్యూటీ కట్టాలోనని.

అప్పటికీ జర్మనీలో ఇండియన్ మిత్రులు కొన్ని టిప్స్ ఇచ్చారు. ఆ ప్రకారం– కస్టమ్స్ ఆఫీసర్ని సంతోషపెట్టడానికి మూడు ఐటమ్సు కొని దగ్గరుంచుకున్నాను. కోన్యాక్ బ్రాందీ, బ్లాక్ అండ్ వైట్ విస్కీ, 555 సిగరెట్లు. ఇందులో సిగరెట్లు విమానంలో కొన్నాను.

నేను ట్రాలీ తోసుకుంటూ వెడుతుంటే– 'ఇటు' అన్న మాట గంభీరంగా వినిపించి ఆగి అటు చూస్తే–

ఓ నడివయస్కుడు. హుందాగా ఉన్నాడు. నన్నే చూస్తున్నాడు. అతడికి నాతో పనేమిటా అని కొంచెం చిరాగ్గానే చూశాను.

'కస్టమ్స్' అన్నాడతడు స్నేహపూర్వకంగా నవ్వుతూ.

ఉలిక్కిపడ్డాను. కస్టమ్సువాళ్లు క్రూరంగా చూస్తూ, వేటకుక్కల్లా మీదికి దూకుతారని విన్నాను. నేను కూడా మరీ అంతలా కాకపోయినా, హిందీ సినిమాల్లో ప్రాణ్, కెయన్ సింగుల్లా (ఇది బొంబాయి కాబట్టి) ఉంటారని ఊహించుకున్నాను. కానీ అతడి ముఖం బల్‌రాజ్ సహానీ అంత మంచిగా, ప్రసన్నంగా ఉండేసరికి 'గెట్ రెడీ ఫర్ అనదర్ డోస్ ఆఫ్ జెలసీ' అని శ్యామలరావుగార్ని గుర్తు చేసుకున్నాను.

అన్నిటికంటే ముందు 'కస్టమ్సు' అన్న మాట వినగానే, నా ముఖంలో చిరాకు మాయమై అసంకల్పితంగా వినయం వచ్చేసింది. అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి 'నమస్తే!' అన్నాను. అతడు ప్రతినమస్కారం చేసి, ఆ వెంటనే చేయి చాచి కరచాలనం చేశాడు.

అతడు ట్రాలీమీదున్న నా సామాన్ని ఎగాదిగా చూశాడు. తర్వాత నన్ను పరీక్షగా చూశాడు.

మొహం చూడగానే తెలిసిపోయినట్లుంది, "మీకిది మొదటి ఫారిన్ ట్రిప్పా?" అన్నాడు.

'ఊఁ' అన్నాను.

గొంతులోంచి పలికింది ఏకాక్షరమే ఐనా, దానిలో భయం, ఆశ వగైరా ఎన్నో భావాలు మిళితమై ఉన్నాయి.

"ఐతే మిమ్మల్నెక్కువ ట్రబుల్ పెట్టను. పెట్టెలన్నీ తెరవనక్కర్లేదు. వాటిలో ఏమేమున్నాయో వివరంగా చెప్పండి" అన్నాడతడు.

నిజాయితీగా, బుద్ధిగా వివరాలు చెప్పాను. అతడు శ్రద్ధగా విన్నాడు. మొహం చూస్తే నా నిజాయితీని అనుమానించినట్లు లేదు.

"టైపురైటరు, టేపు రికార్డరు, కెమేరా– ఆ మూడూ చూపించండి, చాలు" అన్నాడు.

అర్థమైంది. మిగతావాటికి డ్యూటీ పడదు. కొంచెం సంతోషం కలిగినా, ఈ మూడింటికీ ఎంత వేస్తాడోనన్న బెంగ కూడా ఉంది.

ఎలక్ట్రికల్ టైపురైటరు బయటే ఉంది. గ్రుండిగ్ స్పూల్ టైపు స్టీరియో టేపు రికార్డరు, కోనికా కెమేరా బయటకి తీశాను.

తీసేటప్పుడు మిగతావి అతడి కళ్లబడకుండా జాగ్రత్త పడ్డాను. వాటి వివరాలతడికి చెప్పి ఉన్నా- ఏమో, చూస్తే బుద్ధి మారుతుందేమోనని అనుమానం.

అతడు కెమేరాని ఎగాదిగా చూసి, "ఇది అటోమాటిక్ కెమేరా కదూ!" అన్నాడు. దానికైతే డ్యూటీ లేదంటూ నాకు వెనక్కిచ్చేశాడు. అది పాకెట్ సైజుది కావడంతో ఉత్సాహంగా చొక్కా జేబులోకి తోసేశాను.

'ఎలక్ట్రికల్ టైపురైటరు, స్టీరియో టేపురికార్డరు- రెండింటిలో ఒక దానికి ఎగ్జెంప్షన్ ఇవ్వచ్చు. ఒకదానికి డ్యూటీ కట్టాలి" అన్నాడతడు. నానుంచి కస్టమ్స్ డ్యూటీ తీసుకోవడం అతడికి బాధగా ఉందనిపించింది, ఆ గొంతు వింటే!

నేనెక్కువ ఆలోచించలేదు. "దేనికైతే తక్కువ డ్యూటీ పడుతుంది?" అన్నాను కాస్త చనువు తీసుకుని.

"దేనికైనా పన్నెండొందలలే. రెండూ మీకోసమే ఐనా, రెండూ ఎవరికోసమో ఐనా- దేనికి డ్యూటీ కట్టినా ఫరవాలేదు. ఒకటి మాత్రమే మీకోసమై- మరొకటి ఎవరికోసమో ఐతే- చాయిస్ ఈజ్ యువర్స్" అన్నాడతడు.

అతడు సామాన్యుడు కాదు. కానీ సామాన్యుల మనస్తత్వాల్ని ఔపోసన పట్టినవాడు. సామాన్యులకు వీలైనంత సాయపడేవాడు.

ఒక్క క్షణం ఆలోచించాను.

టైపురైటరు నటరాజన్‌ది. డ్యూటీ పడితే కట్టమని అతడు నాకు డబ్బు కూడా ఇచ్చాడు. కస్టమ్స్ ఆఫీసరు సూచన ప్రకారం, డ్యూటీ దానికే కట్టాలి. అదీకాక పన్నెండొందలంటే తక్కువ మొత్తం కాదు. నేనైతే వందో రెండొందలలో ఉంటుందనుకున్నాను. ఐనా కూడా డ్యూటీని నటరాజన్‌కి అంటగట్టడం స్నేహధర్మం కాదనిపించింది. పోనీ, ఆ డ్యూటీని ఇద్దరం పంచుకుంటే...?

ఏదేమైనా టేపు రికార్డరుకే డ్యూటీ కట్టాలని నిర్ణయించుకున్నాకనే మనసు కుదుటపడింది.

"టేపు రికార్డరు నాకోసమే! కానీ డ్యూటీ కొంచెం తగ్గదా?" అన్నాను జాలిగా.

అతడు టేపు రికార్డరు ధర అడిగాడు. ఎన్నాళ్లనుంచి వాడుతున్నామో తెలుసుకున్నాడు. మనసులో మరోసారి లెక్కలు వేసి, 'సారీ! పన్నెండొందలకు తగ్గదు" అన్నాడు.

'క్షణక్షణముల్ జవరాంధ్ర చిత్తముల్' అన్నట్లు ఇలాంటిచోట్ల నాన్పుడు ప్రమాదం. అందుకని మాటలు పెంచలేదు. పక్కనే ఉన్న ఎక్స్‌ఛేంజిలో మార్కులు కొన్ని రూపాయల్లోకి మార్చి అతడికి డబ్బిచ్చాను. అతడు వెంటనే రసీదు కూడా ఇచ్చాడు.

ఆ రసీదు చూడగానే– నాకొకటనిపించింది. దానిమీద టేపు రికార్డరుకోసమని వ్రాసి ఉంది. అది నటరాజన్‌కి చూపించి, అందులో సగం టైపురైటరుకి అని చెబితే, అది కక్కుర్తి అనిపించుకుంటుంది. తన టైపురైటరు డ్యూటీ ఫ్రీగా ఇండియా చేరిందంటే– అతడు సంతోషిస్తాడు– ఆ సంతోషం ముందు ఆరొందలో లెక్కా అనుకున్నాను.

అలా అనుకోగానే గుర్తొచ్చింది నాకు– కస్టమ్స్ ఆఫీసరుకోసం చిరుకానుకలు తెచ్చానని. బంధుమిత్రులకోసం కానుకలు కొన్న నేను– అంత మంచి ఆఫీసరుకి ఏమైనా ఇవ్వడం ధర్మమనిపించింది.

"అది లంచం కాదా?" అడిగింది మనసు.

"చెకింగుకి ముందిస్తే లంచం. చెకింగైపొయ్యాకిస్తే– కానుక" అంది విచక్షణ.

బై చెప్పి వెళ్లబోతున్న అతడితో, 'నా దగ్గిరున్నవాటిలో మీకిష్టమైనది ఏమైనా తీసుకుంటే, ఐ విల్ బి మోర్ హాపీ" అన్నాను.

తీసుకుంటాడా, కేకలేస్తాడా అని సంకోచించాను కానీ, "ఏమిస్తారు?" అన్నాడతడు నవ్వి.

"బ్లాక్ అండ్ వైట్ విస్కీ, కోన్యాక్ బ్రాందీల్లో ఏదైనా సరే! రెండూ కావాలన్నా సరే!" అన్నాను.

అతడు మళ్లీ నవ్వి, "అవేం వద్దు. సిగరెట్లేమైనా ఉంటే...." అన్నాడు.

ప్యాకెట్ జేబులోనే ఉంది. ఠక్కున 555 సిగరెట్ ప్యాకెట్ తీశాను.

"ఇదా? వద్దులెండి– థాంక్స్ ఫర్ ది ఆఫర్" అని వెళ్లిపోయాడతడు.

అప్పుడు స్ఫురించింది నాకు. అతడు బొంబాయి విమానాశ్రయంలో కస్టమ్స్ ఆఫీసరు. రోజూ లక్షలు, కోట్ల విదేశీ వస్తువుల్ని హేండిల్ చేస్తుంటాడు. నా కానుకలు అతడి రేంజికి ఆనతాయా?

అలాగని నాకతడిపై గౌరవభావం తగ్గలేదు. నాలాంటి సామాన్యుల్ని వేధించే కక్కుర్తి లేనందుకు అతణ్ణి మనసులో అభినందించాను.

సామానుతో బయటికొచ్చేసరికి అన్నయ్య ఎదురుచూస్తున్నాడు. సుమారు రెండేళ్లక్రితం జర్మనీ వెడుతున్న నాకు వీడ్కోలు చెప్పడాని కొచ్చాడు అన్నయ్య. మళ్లీ ఇప్పుడు స్వదేశానికి ఆహ్వానించడానికి బొంబాయిలో విమానాశ్రయానికొచ్చాడు.

ఇద్దరం ఒకర్నొకరు ఆప్యాయంగా, ఆత్మీయంగా పలకరించుకున్నాం. మొన్న శ్రీమతి, పిల్లలు క్షేమంగా చేరినట్లూ, తను వాళ్లని రిసీవ్ చేసుకుని, మా దూరపుబంధువుల ఇంట్లో ఉంటున్నట్లూ చెప్పాడు.

టాక్సీ ఎక్కేక– నేను నాకు తటస్థపడ్డ కస్టమ్స్ ఆఫీసర్ గురించి అన్నయ్యకి చెప్పి, ఇండియాలో కస్టమ్స్ వ్యవస్థని తెగ పొగిడాను.

అన్నయ్య వెంటనే, 'అలా పొగిడెయ్యకు. మొన్నటి కస్టమ్స్ ఆఫెసర్ మనవాళ్లని బాగానే తొడిగేశాడు" అన్నాడు.

పెట్టెలన్నీ తెరిచి చూపించమన్నారుట. తెరిచేసరికి వాటిలో ఉన్న చిరుకానుకల్ని చూసి అతడికి కళ్లు చెదిరిపోయేయిట.

"ఇన్ని దేనికి? వ్యాపారం చేస్తారా?" అనడిగేట్ట ఆ ఆఫీసరు.

మాది చాలా పెద్ద కుటుంబమనీ– అందరికీ కానుకలు తీసుకెడుతున్నామనీ, వస్తువులెక్కువున్నా అవి ఖరీదైనవి కావనీ శ్రీమతి వాళ్లకి వివరణ ఇస్తుండగా– అన్నయ్య కూడా అనుమతి తీసుకుని లోపలికి వెళ్లేట్ట. ఆఫీసరుకి తన హోదా చెప్పి, శ్రీమతికి వత్తాసుగా మాట్లాడబోతే– ఎందుకో ఆ ఆఫీసరుకి మరింత కోపం వచ్చిందిట.

"నేను కలగజేసుకోకపోతే ఏమయేదో– నేను మాట్లాడేక ఆ ఆఫీసరు, మొత్తం వస్తువులన్నింటికీ కూడా డ్యూటీ కట్టాలన్నాడు. వాటిలో ఉన్న మిక్సీ, మరికొన్ని గృహోపకరణ వస్తువులు– ఏడాదిగా వాడుతున్నట్లు నిదర్శనాలు చూపినా, పట్టించుకోలేదు. మొత్తం మూడువేల ఆరొందలు వేశాడు" అన్నాడు బాధగా.

ఒక్క క్షణం అప్సెట్టయ్యాను. ఐతే ఒక్క క్షణమే!

అన్నయ్య బ్యాంకు ఆఫీసరు. తన హోదాకు సమాజంలో చాలా విలువుంది. అది ఎన్నోమార్లు నేనే స్వయంగా చూశాను. నిన్న కస్టమ్స్ డ్యూటీ తగ్గించడానికి– తన హోదా ఉపయోగపడలేదన్న బాధ ఇప్పుడు అన్నయ్య గొంతులో ధ్వనించింది.

'అనువు కానిచోట అధికులమనరాదు' అని మనం గ్రహించడం ఒక ఎత్తు. మనం గ్రహించాలని ఎదుటివారు అనుకోవడం ఇంకో ఎత్తు.

"మన బంధుమిత్రులకి విదేశీ కానుకలిచ్చే అవకాశం రావడం మన అదృష్టం. అందుకు మనం సంతోషించాలి. ఆ అదృష్టానికి కొంత మూల్యం చెల్లించాల్సొస్తే చెల్లిస్తాం తప్ప– మన సంతోషానికి దూరం కాలేము" అన్నాను.

అది అన్నయ్యకు అనునయంగా మాత్రమే కాదు, నా మనసుకు స్ఫురించిన యథార్థం కూడా!

ఇక మేము మా గూళ్లు చేరుకోవాలి.

నా ప్లేన్ టికెట్ భువనేశ్వర్ వరకూ ఉంది. మావాళ్లు ట్రయిన్లో రావాలి కాబట్టి, అందుకు తగ్గట్లే మా ప్రయాణానికి ప్రోగ్రాం వేసుకున్నాం.

నేను విమానంలో ముందు కలకత్తా చేరుకుంటాను. నా శ్రీమతినీ పిల్లల్నీ తీసుకుని అన్నయ్య కలకత్తా వచ్చేక, అక్కణ్ణించి మావాళ్లు ట్రయిన్లోనూ, నేను విమానంలోనూ భువనేశ్వర్ చేరుకుంటాం.

ట్రయిన్లో ప్రయాణం చేస్తున్నప్పుడు– చలి దేశంలో ఏడాదిపైన ఉండి, మిసమిసలాడిపోతున్న శ్రీమతి– పిల్లలముందు తాను వెలవెల బోయాననీ– ట్రయిన్లో అందరి కళ్లూ మావాళ్లమీదనేననీ– అన్నయ్య తర్వాత నాకు గర్వంగా చెప్పాడు.

కలకత్తానుంచి భువనేశ్వర్ వెళ్లడానికి మాకు వెంటనే బుకింగ్సు దొరకలేదు. అలా అక్కడ అన్నయ్యింట్లో నేనో రెండురోజులూ, మావాళ్లు వారం రోజులూ ఉండిపోవాల్సొచ్చింది.

అక్కడున్న రెండ్రోజుల్లోనూ– ఫారిన్ వెళ్లొచ్చినవాళ్లకి మన దేశంలో విలువ పెరిగిపోతుందని అర్థమైంది నాకు.

అన్నయ్య బాస్‌కోసం నేను బ్లాక్ అండ్ వైట్ విస్కీ బాటిల్ తెచ్చాను. బొంబాయిలో కస్టమ్స్ ఆఫీసర్లా కాక, ఆయన ఆ కానుకకి తెగ మురిసిపోయాడు. మిసమిసలాడిపోతున్న నన్ను చూసి, “మీ అన్నదమ్ముల్లో ఇంత తేడా ఎలా వచ్చింది?” అనడిగాడు.

“మొదట్నించీ మావాడిది పచ్చటి ఛాయ. నేను చామనఛాయలో కొంచెం నలుపువైపే ఉంటాను” అన్నాడు అన్నయ్య గర్వంగా.

నన్ను చూసి గర్వపడ్డం అన్నయ్యకు కొత్త కాదు. మా ఇద్దరికీ వయసులో ఉన్న తేడా ఏడాదికి ఎనిమిదిరోజులు తక్కువ. ఆరో తరగతి నుంచి ఏడాది రీసెర్చిదాకా– ఇద్దరం కలిసి చదువుకున్నాం. తను ఆర్ట్సు, నేను సైన్సు. అంతే తేడా!

ఐతే పెర్సనాలిటీలో నేనెప్పుడూ తనకి తీసికట్టే!

తను నాకంటే పొడుగు. మామూలుగానే హుందాగా ఉంటాడు. డ్రెస్ సెన్సు మరింత హుందాతనమిచ్చింది.

ఇప్పటి మిసమిస– నాకు జర్మనీ పూసిన పూత. అక్కడ వాళ్లమధ్య నాకది తెలియలేదు. ఇక్కడ నాకిది శాశ్వతం కాదని తెలుసు.

నేను భువనేశ్వర్ విమానాశ్రయంలో దిగినప్పుడు ఆఫీసు నాకోసం కారు పంపింది. ఐతే నాకు స్వాగతం పలకడానికి– యాభైమందికి పైగా రావడం ఆశ్చర్యాన్ని కలుగజేసింది.

తెలుగువాళ్లు చాలామంది కుటుంబాలతో వచ్చారు. ఉత్తరాది, ఒరియా మిత్రులు కొందరొచ్చారు. వాళ్లందరితో ఉత్తరాల ద్వారా కంటాక్టులో ఉండడం ఒక కారణమేమో కానీ– విదేశమెళ్లి తిరిగొచ్చిన ఒక మామూలు సైంటిస్టుని రిసీవ్ చేసుకుందుకు ఎయిర్‌పోర్టుకి అంతమంది రావడం– అంతకు ముందూ ఆతర్వాతా– అక్కడ నేనెరుగను.

కాలనీలో– అప్పటికే నాకోసం అందుబాటులో ఉన్న చిన్న క్వార్టరొకటి తాత్కాలికంగా నాకు అలాటయింది. ఐతే అది ఖాళీ అవడానికి మూణ్నాలుగు రోజులు పట్టొచ్చు. అంతవరకూ రవి ఇంట్లో అతిథిగా ఉన్నాను. రవి దంపతులు అక్కడ అందర్లోకీ మాకు సన్నిహితులు.

రాగానే రవి ఇంట్లో సామాను పెట్టుకుని, ముందు ఆఫీసుకెళ్లి డైరెక్టర్ ప్రఫుల్లని కలుసుకున్నాను.

కుశల ప్రశ్నలైన వెంటనే ప్రఫుల్ల నాతో, “నీ లెటర్ చూశాను. నువ్వు రాసింది కరెక్టే. పొరపాటు ఇక్కడే జరిగింది” అన్నాడు.

జర్మనీలో గడువుకు మించి మూణ్ణెల్లుండడానికి ఆఫీసునుంచి అనుమతి లభించేక- కనీసం మరో మూణ్ణెల్లు ఇవ్వమని డాడ్ సంస్థ ఆఫీసుని కోరింది. అది నేను చెప్పి వ్రాయించినట్లు భావించిన మా ఆఫీసు, నాపై చర్య ఎందుకు తీసుకోకూడదన్నట్లు తాఖీదు పంపింది నాకు. డాడ్ ఆఫీసు మా ఆఫీసుకి రిక్వెస్టు పంపితే, దానికి నామీద చర్య ఏమిటని- ఆఫీసుని తప్పు పడుతూ ప్రఫుల్లకి నేనుత్తరం వ్రాశాను.

ఇప్పుడు ప్రఫుల్ల చెబుతున్నది ఆ ఉత్తరం గురించే!

ఇప్పుడాయన ఆ ఉత్తరాన్ని ప్రస్తావిస్తాడనుకోలేదు. "ఇంతకీ ఈ పొరపాటెలా జరిగింది సార్!" అన్నాను ఆశ్చర్యం ప్రకటిస్తూ.

"ఇదివరకు అడ్మినిస్ట్రేటషనుకి అధికారి 'ఏఓ' అనగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరొక్కడే! ఇప్పుడు 'ఏ'ఓపై అజమాయిషీకి కొత్తగా 'సిఒఎ' అనగా కంట్రోలర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌ని నియమించారు. అలా ఇటీవలే వచ్చిన సిఒఎ రావు కొంచెం తిక్క మనిషి. అడ్మినిస్ట్రేషనుపై పూర్తి పెత్తనం తనదే అనుకుంటూ, ఒకోసారి నాకు చెప్పకుండానూ కొన్ని నిర్ణయాలు తీసుకుంటాడు. నీ విషయంలో అదే జరిగింది. నీ ఉత్తరం చూసేక నాకది తెలిసి, వెంటనే పిల్చి గట్టిగా మందలించి, ఆ కరెస్పాండెన్సుని ఫైల్లోంచి తీసేయించాను. జరిగిందానికే మనుకోకు. అతడి తరఫున నేను సారీ చెబుతున్నా" అన్నాడు ప్రఫుల్ల.

ఐతే కొలీగ్సు ఉత్తరాల ద్వారా రావు గురించి కొంత తెలుసు నాకు. ఆయన కన్నడిగుడు. తెలుగు బాగా రావడమే కాదు, తెలుగు సాహిత్యమంటే ప్రీతి. ఇంట్లో అంతా తెలుగు పత్రికలు చదువుతారు. ఆయనొచ్చిన కొన్నాళ్లకే- కాలనీవాసులకు కొత్త సదుపాయా లొచ్చాయి. ఆఫీసులోనూ, కాలనీలోనూ నిస్వార్థపరుడన్న పేరు కూడా తెచ్చుకున్నాడు.

ప్రఫుల్ల మంచివాడే కానీ, అక్కడ అందరికీ తనే పై అధికారినన్న అహముంది. సిఒఎ రావు తనకంటే మంచిపేరు తెచ్చుకోవడం ఆయనకు నచ్చలేదు. వారిద్దరికీ అంతగా సయోధ్య లేదు.

ప్రఫుల్లని కలుసుకున్న కాసేపటికే రావు వచ్చి నన్ను కలిశాడు. ఎలా తెలిసిందో ఆయనకి అప్పుడే ప్రఫుల్ల తన గురించి నాకు చెప్పిన విషయం తెలిసింది.

"నేను అడ్మినిస్ట్రేషన్‌కి సర్వాధికారిని కావచ్చు కానీ, ప్రఫుల్ల నాకు పై అధికారి. ఆయనకు సలహా ఇవ్వగలను కానీ, నా సలహాని కాదంటే తను చెప్పినట్లే చేసి తీరాలి. మీ విషయంలో ఆయన చెప్పినట్లే చేశాను. నన్ను అపార్థం చేసుకోవద్దు" అన్నాడు సంజాయిషీగా.

నేనాయన భుజం తట్టి, "మీరు నాకు కొత్త కానీ, ప్రఫుల్ల నాకు కొత్త కాదు. మీరు చెప్పకపోయినా, జరిగిందేమిటో నేనూహించాను. ఐతే ఒకందుకు నాకు సంతోషంగా ఉంది. ఆ ఉత్తరం పంపడం పొరపాటని ప్రఫుల్ల ఒప్పుకున్నాడు" అన్నాను ఓదార్పుగా.

ఈ అనుభవాలతో నేను ఇండియాకు తిరిగొచ్చేసిన అనుభూతి పూర్తిగా కలిగింది. 'ఫారిన్ వెళ్లానండి' అనడం మాని, 'తిరిగొచ్చేశానండి' అనుకునే అనుభవాలు మొదలయ్యాయి. ఆ అనుభవాలు అందరికీ సుపరిచితమే కాబట్టి– వాటిలో ఈ రచనకు సందర్భానుసారమైన వాటిలో కొన్నింటిని మాత్రం ఇక్కడ సూచనప్రాయంగా తెలియజేసి– సెలవు ఏతెసుకుంటాను.

నేను రాకపోతే రీసెర్చి వర్కు స్తంభించిపోతుందనీ, జర్మనీలో కొనసాగడానికి– అతికష్టంమీద మూడునెలలు ఎక్స్‌టెన్షన్ ఇస్తున్నాననీ, అంతకుమించి అదనంగా ఒక్కరోజు కూడా నన్ను వదులుకోలేమనీ ఆఫీసునుంచి ఉత్తరం వచ్చింది కదా! తిరిగొచ్చేక నా రీసెర్చికి ఏర్పాట్ల మాటటుంచి, నేను కూర్చునేందుకు గది ఏర్పాటు చెయ్యడానికే ఆర్నెల్లు పట్టింది. ఆ సమయంలో నేను ఎక్కువగా లైబ్రరీలో గడిపేవాణ్ణి.

బెర్లిన్లో లూయిజీ నా వర్కుని పూర్తి చేసి, ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిట్ చేసి డిగ్రీ సంపాదించుకున్నాడు. అచ్చు పుస్తకంగా వచ్చిన ఆ రిపోర్టుకి ఆథర్సులో లూయిజీ, రాలెక్‌లతో పాటు నా పేరు కూడా ఉంది. అందులోని కొన్ని పరిశోధనా ఫలితాలు అంతర్జాతీయ సైంటిఫిక్ జర్నల్లో రీసెర్చి పేపరుగా ప్రచురితమయ్యాయి. నేనా రిపోర్టుకి కాపీ తీయించి ఆఫీసులో సబ్మిట్ చేశాను. లైబ్రరీలో ఉంచడంతో దాని చరిత్ర ముగిసింది. ఐతే ఆ రిపోర్టు, రీసెర్చి పేపరు– ఆ తర్వాత నాకొచ్చిన ప్రమోషన్లో ప్రముఖపాత్ర వహించాయి.

ప్రొఫెసర్ రాలెక్ నాతో రెగ్యులర్ కరెస్పాండెన్సులో ఉండేవాడు. ఆయన గురువు ప్రొఫెసర్ కోల్బెల్ జన్మదిన వేడుకలకు నాకు ఆహ్వానం అందేది. కోల్బెల్ చనిపోయినప్పుడు ఆ విషాదాన్ని కూడా అక్కడివాళ్లతో పంచుకున్నాను.

రాలెక్ నన్ను 'వాన్ హుంబోల్డ్ట్' అనే ప్రతిష్ఠాత్మకమైన ఫెలోషిప్ కోసం తన ద్వారా అప్లై చెయ్యమని ఉత్తరం వ్రాశాడు. నేను ప్రఫుల్లకు చెప్పి, "మీరు సరేనంటే, ఆయననుంచి వర్క్ ప్రోగ్రాం తెప్పిస్తాను" అన్నాను. ఆయన ప్రోగ్రాం తెప్పించుకోమన్నాడు. కానీ రాలెక్ నిజంగానే పది పేజీల ప్రోగ్రాం పంపేసరికి తడబడి, "డబ్బు సంపాదించుకుందుకు ఫారిన్ వెళ్లడానికి నీకు మరో అవకాశం నేనే కల్పిస్తాను. ప్రస్తుతానికి వద్దు" అన్నాడు. ఓ రీసెర్చి సంస్థ సర్వోన్నతాధికారి, రీసెర్చి ఫెలోషిప్‌ని ధనలోభంగా భావించడాన్ని అప్పుడే కాదు, ఇప్పటికీ నేను జీర్ణించుకోలేకపోతున్నాను. ఐతే విదేశీయులకి అసలు విషయం చెప్పడానికి మనసొప్పక, 'వాన్ హుంబోల్డ్ట్'కి అప్లై చెయ్యడానికి అనుమతి లభించలేదు' అని రాలెక్‌కి ఉత్తరం రాశాను. అప్పుడాయనకొచ్చిన కోపమింతా అంతా కాదు. నాకు ప్రోగ్రాం పంపడానికి తను చేసిన నెల్లాళ్ల కృషి వృథా అయినందుకు నన్ను నిందించాడు. ఐనా మా సంబంధాలు మాత్రం తెగిపోలేదు. ఏటా మేము గ్రీటింగ్సు చెప్పుకునేవాళ్లం. ఆయన రిటైర్మెంటు వేడుకకి నాకు ఆహ్వానం అందింది. రాలెక్ శిష్యుల ద్వారా ఆయన మరణవార్తందినప్పుడు– కుటుంబసభ్యుడు పోయినంత బాధ కలిగింది. ఆయన్ని మళ్లీ కలుసుకునే అవకాశం రాకపోవడం నాకో విషాదం.

కూడా తెచ్చుకున్న ఫారిన్ ఎక్స్‌చేంజి డిపాజిట్ చేసి– అప్పట్లో అరుదైన బజాజ్ చేతక్ స్కూటర్ కొన్నాను. అది నడపడం చేతకాక, మంచి లాభానికి దాన్ని అమ్మేశాను.

నటరాజన్ నాగపూర్‌నుంచి తన మిత్రుణ్ణి పంపి, ఎలక్ట్రిక్ టైపురైటర్ తెప్పించుకున్నాడు.

తిరిగి ఇవ్వక్కర్లేదు మొర్రో అని చెప్పినా– నా తొలి ఓవర్‌కోటుని– పూనానుంచి తన మిత్రుడి ద్వారా వెనక్కి పంపాడు శోభన్ ఘోష్. మొక్కపాటి వారు 'పార్వతీశం' టోపీ కథ ఊరికే వ్రాయలేదు మరి!

ఆర్థికంగా అభివృద్ధి చెందిన ఒక విభిన్న వ్యవస్థలో కొన్నాళ్ళుండి వచ్చేక, ఆర్థికంగా అంతగా అభివృద్ధి చెందని మన వ్యవస్థలో ఎన్నో లోపాలు కన్పించవచ్చు. కానీ ఇది మన వ్యవస్థ. ఆ లోపాలవల్ల కలిగే అసంతృప్తిని– ఇక్కడి అనుభవాలు, అనుభూతులు, అనుబంధాలు– పూర్తిగా తొలగించగలవు. అందుకు 1974–76కి ముందూ, ఆ తర్వాతనుంచి నేటివరకూ– సుఖ సంతోషమయమూ. ఉత్సాహభరితమూ అయిన మా జీవితమే నిదర్శనం.

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ! సెలవు!

(సమాప్తం)

Post your comments